క్లుప్తంగా

నారాయణస్వామి ప్రమాణ స్వీకారం



తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న నారాయణస్వామి

ఏలేశ్వరం: తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా గురువారం పట్టణానికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణ స్వామి ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వినితో పాటు 15 మంది డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ తూర్పుకాపుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట సామంతుల గోపి, కోరాడ కృష్ణ మోహన్, జొన్నాడ వీరబాబు, సామంతుల భాస్కరరావు, సామంతుల రాంబాబు తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

బెల్లపు ఊట ధ్వంసం

తుని: రౌతులపూడి మండలం పల్లపు చామవరంలో సారా స్థావరాలపై గురువారం తుని ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తుని ఎక్సైజ్ సీఐ పట్టాభి చౌదరి తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఉపాధి పనుల తనిఖీ



టి.రాయవరంలో గోకులం షెడ్డు పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటలక్ష్మి

ప్రత్తిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ప్రత్తిపాడులో జరుగుతున్న అభివృద్ధి పనులను డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి గురువారం తనిఖీ చేశారు. గ్రామంలో రూ.18 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, టి.రాయవరంలో రూ.3 లక్షలతో చేపట్టిన గోకులం షెడ్డు పనులను ఆమె పరిశీలించారు. పనులు పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్టుగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమారస్వామి, పంచాయతీ రాజ్ జేఈ ఎం.సత్యప్రకాష్, టి.రాయవరం గ్రామ సర్పంచ్ తటవర్తి సుబ్బారావు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెంలో రేషన్ షాపులపై విజిలెన్స్, సివిల్ సప్లయి అధికారులు గురువారం దాడులు చేశారు. పలు షాపుల్లో సరకు నిల్వలు అధికంగా ఉన్నట్టు గుర్తించి 6ఏ కేసులు నమోదు చేశారు. 20వ నంబర్ షాపులో 260 కేజీల రైస్, 200 కేజీల పప్పు, 21వ నంబర్ షాపులో 133 కేజీల రైస్, 306 కేజీల పప్పు ఎక్కువగా ఉన్నట్టు గుర్తించి కేసులు నమోదు చేసినట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

రైల్వే కార్మిక సంఘ ఎన్నికలు

తుని: రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు తునిలో ప్రశాంతంగా జరిగాయి. తుని రైల్వే పిడబ్ల్యూఐ కార్యాలయంలో గురువారం తుని బ్రాంచికి సంబంధించి పోలింగ్ నిర్వహించారు. మొత్తం 792 మంది కార్మికులు ఓటుహక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి దేవ సహాయం తెలిపారు. మూడు కార్మిక సంఘాలైనా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, రైల్వే మజ్దూర్ యూనియన్, దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం గుర్తింపు కోసం ఎన్నికల్లో పోటీ చేశాయి. ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 724 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా నాలుగు ఓట్లు పోలైనట్టు ఎన్నికల అధికారి దేవ సహాయం తెలిపారు.

స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవం

జగ్గంపేట: స్థానిక భవిత కేంద్రంలో గురువారం స్వచ్ఛంద సేవా సంస్థల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పేదలకు సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వందన వలంటరీ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు పులి ప్రసాద్, భవిత స్కూల్ టీచర్ అప్పన పెద్దకాపు, కె.అరుణశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మందకొడిగా వరికోతలు

- మెట్టలో అనుకూలించని వాతావరణం
- ఇప్పటి వరకు పదిశాతం పూర్తికాని వైనం
- ఫెంగల్ ప్రభావంతో తగ్గనున్న దిగుబడులు
- ఆందోళన చెందుతున్న రైతులు



కోటనందూరులో వరికోత కోస్తున్న రైతులు

తుని రూరల్: వాతావరణం అనుకూలించకపోవడంతో మెట్ట ప్రాంతంలో ఖరీఫ్ వరికోతలు మందకొడిగా సాగుతున్నాయి. కోత కోస్తే వర్షానికి పంట తడుస్తుందనే భయం ఒకపక్క, కోతలు ఆలస్యమైతే గింజలు రాలిపోతాయన్న ఆందోళన మరోపక్క రైతులను వేధిస్తున్నాయి. ఇప్పటికే ఫెంగల్ తుపాను ప్రభావంతో వరి పనలు తడిసిపోగా పక్వానికి వచ్చిన వరిపంట వందలాది ఎకరాల్లో నేలకొరిగింది. వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో నేలకొరిగిన పంటను కోయకపోతే కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సబ్‌డివిజన్ ఐదు మండలాల్లో ఇప్పటివరకు 8.60 శాతమే వరికోతలు జరిగినట్టు వ్యవసాయ అధికారులు తెలిపారు. అదనపు ఆదాయం పొందేందుకు రబీలో అపరాలు సాగు చేయాలని రైతులకు అధికారులు సూచిస్తున్నారు. ఆరుగాలం శ్రమించి అధిక పెట్టుబడులు పెట్టినా వరదలు, వాతావరణ ప్రభావం దిగుబడులపై పడుతుందని రైతులు వాపోతున్నారు.



డి.పోలవరంలో ఫెంగల్ తుపానుకు తడవడంతో గట్టుపై ఆరబెట్టిన వరి పనలు



శృంగవృక్షంలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

14,266 హెక్టార్లలో సాగు

వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఈ ఏడాది 14,266 హెక్టార్లలో రైతులు ఖరీఫ్ వరిసాగు చేశారు. తుని మండలంలో 2339 హెక్టార్లు, తొండంగిలో 4900 హెక్టార్లు, కోటనందూరులో 3907 హెక్టార్లు, శంఖవరంలో 665 హెక్టార్లు, రౌతులపూడి మండలంలో 1855 హెక్టార్లలో వరిసాగు జరిగింది. ఇప్పటివరకూ తుని మండలంలో ఒక శాతం, తొండంగి మండలంలో 23 శాతం, కోటనందూరు మండలంలో రెండు శాతం, శంఖవరం మండలంలో 14 శాతం, రౌతులపూడి మండలంలో మూడు శాతం (సరాసరిగా 8.60 శాతం) కోతలు జరిగినట్టు ఏడీఏ సుంకర బుల్లిబాబు తెలిపారు. మరోపక్క దిగుబడులు అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో అపరాల విత్తనాలు

ఖరీఫ్ అనంతరం రబీలో అపరాలు సాగు చేసేందుకు రాయితీపై రైతు సేవా కేంద్రాల్లో మినుము, పెసర విత్తనాలు అందిస్తున్నారు. తుని మండలంలో ఎనిమిది క్వింటాళ్లు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు మండలాల్లో నాలుగేసి క్వింటాళ్ల చొప్పున విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్ డీలర్ల వద్ద తుని మండలంలో పది క్వింటాళ్లు, శంఖవరం మండలంలో 13 క్వింటాళ్లు, కోటనందూరు మండలంలో 9.08 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయి.

పెట్టుబడులు పెరిగాయి

రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. వాతావరణంలో మార్పులు, వరదల ప్రభావం వ్యవసాయంపై పడింది. మూడో వంతు పంట నేలకొరిగింది. పెట్టుబడులు అధికమయ్యాయి. ఎకరాకు రూ.25 వేలు చొప్పున రూ.50 వేలు పెట్టుబడి పెట్టాను. కోతలు కోసి నూర్పుడి చేసినా అకాల వర్షాలతో ఫలసాయం ఇంటికి చేరేవరకు ఆందోళన తప్పడం లేదు. దిగుబడులు, గిట్టుబాటు ధర లభిస్తేనే నష్టాల నుంచి గట్టెక్కుతాం.

– పదిలం పెదకాపు, రైతు, అగ్రహారం

వాతావరణం ఆధారంగా కోతలు చేపట్టాలి

వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుని రైతులు వరికోతలు చేపట్టాలి. వరి పనలు ఆరిన వెంటనే కుప్పలు వేయాలి. కోతలు ఆలస్యమైతే ఈదురు గాలులకు నేలకు ఒరిగిపోకుండా పది అడుగులకు ఒకటి చొప్పున కాలిబాటలు ఏర్పాటు చేయాలి. తడిసిన పనలపై ఉప్పునీటి ద్రావణం పిచికారీ చేయడం ద్వారా రంగు మారకుండా జాగ్రత్తలు వహించాలి. రబీలో సాగు చేసేందుకు రాయితీపై అందిస్తున్న అపరాల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సుంకర బుల్లిబాబు, ఏడీఏ, తుని

మాజీ సీఎం జగన్‌ను కలసిన నాయకులు



మాజీ సీఎం జగన్‌ను కలసిన గణేశ్‌రాజా

జగ్గంపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జగ్గంపేట మండల వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, మరికొంత మంది నాయకులు తాడేపల్లిలో జగన్‌ను కలిసి పలు అంశాలను వివరించారు. జగ్గంపేట సోషల్ మీడియా కన్వీనర్ కాపారపు వెంకట రమణను పోలీసులు అరెస్ట్ చేసిన విషయాన్ని జగన్‌కు వివరించినట్టు గణేష్ రాజా తెలిపారు. దీనిపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి రమణ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని చెప్పారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

జగ్గంపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నిందితులకు పెద్దాపురం కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట సర్కిల్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ డ్రైవ్ తనిఖీల్లో 11 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరిని కోర్టుకు తరలించగా వీరిలో 9 మందికి ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా, ఇద్దరికి రెండు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్టు చెప్పారు.

రేపు అన్నవరంలో 'ఐలాజ్' రాష్ట్ర మహాసభ



ఐలాజ్ సమావేశంలో ఐక్యత చాటుతున్న న్యాయవాదులు

అన్నవరం: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) మొదటి రాష్ట్ర మహాసభను ఈ నెల 8న స్థానిక శేషాద్రి సదన్‌లో నిర్వహించనున్నట్లు ఐలాజ్ రాష్ట్ర నాయకుడు, న్యాయవాది బుగతా శివ తెలిపారు. అన్నవరంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, న్యాయ విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని, న్యాయవాదులపై దాడులు అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. న్యాయవాదుల ప్రయోజనాలను కాపాడటంలో ఐలాజ్‌అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. సమావేశంలో ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు అవసరాల దేవి, బండారు నరసింహారావు, బత్తుల రవికుమార్, యడ్ల శ్రీనివాస్, జోన్నాడ రాజేష్, పోతుల జోగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై విద్యార్థుల దాడికి నిరసన



ప్రత్తిపాడు ఎంఈఓ రాజబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు: రాయచోటిలో ఉపాధ్యాయుడిపై విద్యార్థుల దాడిని ఖండిస్తూ గురువారం మండల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ప్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల దాడి ఘటన భారత సంస్కృతి పతనాన్ని తెలియజేస్తోందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ప్రతినిధులు సుంకర శ్రీనివాస్, ఎస్.రాజేష్, ఎన్.శ్రీనివాస్, కేఎస్ సుబ్రహ్మణ్యం, పి.స్వప్న, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థినులకు చట్టాల పై అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ ప్రకాష్‌బాబు

గోకవరం: విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాజమహేంద్రవరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఒ.ప్రకాష్‌బాబు అన్నారు. గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి ప్రకాష్‌బాబు విద్యార్థినులకు గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, ఆడ పిల్లలకు విద్య ఆవశ్యకత, జెండర్ వివక్షత, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధీర్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ డీపీఎం సంపత్ కుమార్, ఏపీఎం జయంతి రాజు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సత్యవతి, కో ఆర్డినేటర్లు కిశోర్‌వర్మ, సత్యనారాయణ, కనకదుర్గ, నిర్మల్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యకర్త పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

7న పేరెంట్స్ మీటింగ్

శంఖవరం: మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించనున్నట్టు ఎంఈఓ ఎస్‌వీ రమణ తెలిపారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు, అభ్యసన ప్రక్రియలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పేరెంట్స్ మీటింగ్‌లో చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

రౌతులపూడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ -2 గాడి కొండబాబు తెలిపారు.

మట్టి శివలింగానికి ప్రాణ ప్రతిష్ఠ



ఉప్పలపాడులో మట్టి శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడు ఆయిల్ పామ్ తోటలో గురువారం మట్టితో చేసిన శివలింగానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. గ్రామానికి చెందిన పురోహితుడు చంద్రమౌళి సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. గ్రామం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఏటా కార్తికమాసం ముగిసిన మూడో రోజు స్వామివారికి పూజలు నిర్వహిస్తున్నట్టు పురోహితులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తుని: స్థానిక గణపతినగర్ పార్కులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సిటీ వాకర్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్ సోమేశ్వరరావు గురువారం తెలిపారు. వాకర్స్ సభ్యులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేస్తారన్నారు. వాకర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేలల సంరక్షణ అందరి బాధ్యత

- ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం
- ఏలేశ్వరంలో అవగాహన ర్యాలీ



ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న వ్యవసాయాధికారి జ్యోతి, సిబ్బంది

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి ఆధ్వర్యంలో నేల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2002లో అంతర్జాతీయ సాయిల్ సైన్సెస్ యూనియన్ డిసెంబర్ 5న ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. నేల లేకపోతే జీవరాశులకు మనుగడ లేదన్నారు. సాగులో రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడితే నేల సారవంతం కోల్పోతుందన్నారు. నేల సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. నీటి వృథాను తగ్గించి అడవులను కాపాడుకోవడం ద్వారా నేల సారవంతంగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గౌరమ్మకు సారె సమర్పణ



జగపతినగరంలో అమ్మవారి సారెను ఊరేగిస్తున్న భక్తులు

కిర్లంపూడి: జగపతినగరంలో గౌరీశంకరుల ఆలయం వద్ద వేంచేసిన గౌరమ్మ అమ్మవారికి గురువారం సారె సమర్పించారు. గ్రామానికి చెందిన వేలాది మంది మహిళా భక్తులు పలు రకాల పిండి వంటలు, స్వీట్లు, పండ్లను గ్రామం ఊరేగించారు. ఆలయానికి చేరుకుని సారెను అమ్మవారికి సమర్పించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం గౌరీశంకరులను దర్శించి పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కర్రి సూర్యప్రసాద్, ఆళ్ల బాబులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫ్లెక్సీ తొలగింపు

సాక్షి ఇంపాక్ట్

తొండంగి: మండలంలోని ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు గురైంది. తొండంగిలో కూటమి పార్టీ నేతల ఫ్లెక్సీలను అధికారులు తొలగించకపోవడంపై గురువారం 'సాక్షి'లో 'కొండెక్కిన కోడ్' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. కాగా ఈ కథనంపై అధికారులు స్పందించారు. ఫ్లెక్సీల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్ మురార్జీ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది ఫ్లెక్సీలను తొలగించారు.



తొండంగిలో పెద రామాలయం ఎదురుగా ఉన్న ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- ప్రత్తిపాడు నియోజకర్గంలో 94 శాతం పోలింగ్
- కాకినాడ స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్స్‌లు



తునిలో ఓటు వేసేందుకు క్యూలో వేచి ఉన్న ఉపాధ్యాయులు



గండేపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ భాస్కరరావు

ఏలేశ్వరం: ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం నియోజకవర్గవ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలో 272 మంది ఓటర్లకు గాను 257 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 94 శాతం పోలింగ్ నమోదైంది. ఏలేశ్వరం మండలంలో 101 ఓట్లకు 97, ప్రత్తిపాడు మండలంలో 74 ఓట్లకు గాను 69, శంఖవరం మండలంలో 54 ఓట్లకు గాను 49, రౌతులపూడి మండలంలో 43 ఓట్లకు గాను 42 ఓట్లు పోలయ్యాయి. ఏలేశ్వరం ఎన్నికల అధికారిగా ఏఓ మేరీ వ్యవహరించారు. ఆయా మండల కేంద్రాల్లో ఎంపీడీఓ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ పోలింగ్ సరళిని పరిశీలించారు. యూటీఎఫ్ మండల నాయకులు జట్ల సోమరాజు, సంజీవి, ఆదివిష్ణు, ఎం.రాంబాబు, పొన్నాడ జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

తుని: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. గురువారం తుని నియోజకవర్గ పరిధిలోని తుని, తొండంగి, కోటనందూరు మండల కేంద్రాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. తుని నియోజకవర్గం పరిధిలో 345 ఓట్లకు 313 ఓట్లు పోల్ అయ్యాయి. తుని మండలంలో 261 ఓట్లకు 231, తొండంగిలో 61 ఓట్లకు 59, కోటనందూరులో 23 ఓట్లకు 23 ఓట్లు పోలైనట్టు అధికారులు తెలిపారు. పోటీలో ఉన్న ఐదుగురు అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ పూర్తికావడంతో బ్యాలెట్ బాక్సులను కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలకు తరలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

గోకవరం: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం జగ్గంపేట నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగ్గంపేట, గోకవరం, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో మొత్తం 182 ఓట్లకు 167 ఓట్లు పోలయ్యాయి. కిర్లంపూడి మండలంలో 53 ఓట్లకు గాను 50 ఓట్లు, గోకవరంలో 54 ఓట్లకు గాను 49 ఓట్లు, గండేపల్లిలో 32 ఓట్లకు 28, జగ్గంపేట మండలంలో 43 ఓట్లకు 40 ఓట్లు పోలైనట్టు అధికారులు వివరించారు. గోకవరంలో పోలింగ్ కేంద్రాన్ని తూర్పుగోదావరి అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి తనిఖీ చేశారు.

తుని రూరల్: ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి తుని మండలంలో 88.50 శాతం ఓట్లు పోలైనట్టు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ ముగిసే సమయానికి 261 ఓట్లకు గాను 231 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు ఆయన తెలిపారు. ప్రశాంతంగా ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. బ్యాలెట్ బాక్సును కాకినాడ స్ట్రాంగ్ రూమ్‌కు పంపించినట్టు ఆయన వివరించారు. పట్టణ ఎస్సై విజయబాబు, ఏఎస్సై రత్నం పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు.

తొండంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 61 మంది ఉపాధ్యాయులకు ఓటు హక్కు ఉండగా 59 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల అధికారి జగదీష్‌కుమార్ తెలిపారు.

ప్రత్తిపాడులో 97.2 శాతం పోలింగ్

ప్రత్తిపాడు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లో పోలింగ్ ముగిసే సమయానికి 97.2 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 71 మంది ఓటర్లుండగా 51 మంది పురుషులు, 18 మంది స్త్రీలు వెరసి 69 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. కాగా ఈపోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ ఎస్పీ ఎంజీవీ భాస్కరరావు పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎస్సై ఎం.లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా పోలింగ్ కేంద్రం సముదాయంలో ఉన్న సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మూసివేయడం వల్ల ఆర్థిక లావాదేవీలు, క్రయవిక్రయాలు నిలిచిపోయాయి.

పోలింగ్ కేంద్రం తనిఖీ

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాన్ని ఏఎస్పీ ఎంజీవీ భాస్కరరావు తనిఖీ చేశారు. భద్రత ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పెద్దాపురం ఇన్‌చార్జ్ సీఐ క్రాంతి కుమార్, గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు ఉన్నారు. మండలంలో 32 ఓట్లకు గాను 28 ఓట్లు పోలైనట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

కిర్లంపూడి: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 53 మంది టీచర్లకు గాను 50 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు తహసీల్దార్ జె.చిరంజీవి తెలిపారు.

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్టు తహసీల్దార్ జేవీఆర్ రమేష్ తెలిపారు. 43 ఓట్లకు గాను 40 ఓట్లు పోలైనట్టు ఆయన వివరించారు.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎస్పీ



కోటనందూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

కోటనందూరు: మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. 23 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉండగా 100 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సరళిని తహసీల్దార్ టి.శుభాష్ పరిశీలించారు. ఎన్నికల కేంద్రాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు.